

నేడు జిల్లాస్థాయి స్పందన రద్దు

ప్రజాశక్తి - ఏలూరు



స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ నిర్వహిస్తున్న కారణంగా ఈ నెల 27వ తేదీ ఏలూరులో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో 'స్పందన' కార్యక్రమం సోమవారం యథావిధిగా నిర్వహిస్తారని పేర్కొన్నారు.

వైద్యం.. మిథ్య..!

- అస్తవ్యస్తంగా ఏలూరు ప్రభుత్వాసుపత్రి
- జిల్లా ఆసుపత్రి రద్దు.. మెడికల్ కాలేజీగా మార్పు
- వైద్యమందించే డాక్టర్లంతా బదిలీతో రోగులకు అవస్థలు
- 450 బెడ్స్ నుంచి 350కు కుదింపు.. ఒపి సేవలు భారీగా తగ్గింపు
- రోగులకు ప్రయివేటు ఆసుపత్రులే దిక్కు
- మెడికల్ కాలేజీ ఆరంభం ఈ ఏడాదీ అనుమానమే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సరైన వైద్యసేవలు అందక రోగులు పడుతున్న అవస్థలు రోజురోజుకీ వర్ణనాతీతంగా మారుతున్నాయి. మెడికల్ కాలేజీ ఏర్పాటు పేరుతో జిల్లా ఆసుపత్రిని రద్దు చేయడం రోగుల పాలిట శాపంగా మారింది. మెడికల్ కాలేజీగా మార్పు చేసి గతంలో పని చేసే వైద్యులందరినీ బదిలీలపై పంపించేశారు. దీంతో ఆసుపత్రిలో వైద్యసేవలు పూర్తిగా పడకేశాయి. ఫలితంగా రోజురోజుకీ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య తగ్గిపోతుంది. గత్యంతరంలేని పరిస్థితుల్లో ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు 450 బెడ్స్ ఉండేవి. రోజుకు దాదాపు 1100 నుంచి 1500 వరకూ అవుట్ పేషెంట్స్ వచ్చేవారు. మెడికల్ కాలేజీగా మారిన తర్వాత బెడ్స్ సంఖ్యను 330కు కుదించేశారు. సరైన వైద్యులు లేకపోవడంతో వైద్యసేవలు సైతం అందడం లేదు. జిల్లా ఆసుపత్రి రద్దు కావడంతో ఏలూరు జిల్లాలో వైద్యసేవల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. జిల్లాలో దాదాపు 21 లక్షల జనాభా ఉన్నారు. వైద్యవిధాన పరిషత్ నిబంధనల ప్రకారం 2.50 లక్షల జనాభాకు ఒక ఏరియా ఆసుపత్రి ఉండాలి. ఆ ప్రకారం చూస్తే నియోజకవర్గానికి ఒక ఏరియా ఆసుపత్రి ఉండాలి. అంటే ఏడు ఏరియా ఆసుపత్రులు ఉండాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లాలో జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి (ఇటీవలే ఏరియా ఆసుపత్రిగా ప్రకటించారు)లో మాత్రమే ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. దెందులూరు, కైకలూరు, పోలవరం, బుట్టాయగూడెం, భీమడోలు వంటి చోట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మాత్రమే ఉన్నాయి. ఏరియా ఆసుపత్రిలో 50 నుంచి వంద పడకలు ఉంటాయి. అదే కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో బెడ్స్ తక్కువగా ఉండటంతోపాటు ఇక్కడ ప్రాథమిక వైద్యం మాత్రమే అందుతోంది. ఏలూరు నియోజకవర్గాన్ని పరిశీలిస్తే 3.50 లక్షల జనాభా ఉండగా ఒక్క ఆసుపత్రి కూడా లేకుండాపోయింది. ఉన్న జిల్లా ఆసుపత్రిని మెడికల్ కాలేజీగా మార్పు చేసేశారు. జిల్లా ఆసుపత్రిని అదేవిధంగా కొనసాగించి మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోలేదు. మెడికల్ కాలేజీగా మార్పుతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే 40 మంది వైద్య నిపుణులు, 150 మంది పారా మెడికల్ సిబ్బంది పోస్టులు రద్దయ్యాయి. దీంతో ఏలూరు జనరల్ ఆసుపత్రిలో వైద్యం అందడం లేదు. చిన్నచిన్న కేసులను సైతం విజయవాడ, గుంటూరు రిఫర్ చేసేస్తున్నారు. వరంగా మారాల్సిన మెడికల్ కాలేజీ జనాలకు శాపంగా మారిన పరిస్థితి నెలకొంది. వెంటనే ఏలూరులో ఏరియా ఆసుపత్రిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది.




ఏలూరు ప్రభుత్వాసుపత్రి

పట్టించుకోని అధికారులు

ఏలూరులోని జనరల్ ఆసుపత్రిలో వైద్యసేవల గురించి ఏఒక్క అధికారీ పట్టించుకోవడం లేదు. గతంలో వైద్యం సరిగా అందకపోతే సూపరింటెండెంట్ నుంచి సీనియర్ వైద్యులంతా స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండాపోయింది. జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆసలున్నారో.. లేరో కూడా ఏఒక్కరికీ తెలియడం లేదు. ఉన్న వైద్యులు సైతం అనుభవం లేని వారు కావడంతో సరైన వైద్యసేవలు అందడం లేదని రోగులు గగ్గోలు పెడుతున్నారు. తక్షణం రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోకపోతే రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. మెడికల్ కాలేజీలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందాలంటే ఐదేళ్లు పట్టనుందని చెబుతున్నారు. అప్పటి వరకూ సామాన్య ప్రజానీకం పరిస్థితి ఏమిటో ప్రభుత్వమే చెప్పాలి.

ఈ ఏడాది మెడికల్ కాలేజీ ప్రారంభమయ్యేనా?

150 సీట్లతో ఈ ఏడాది మెడికల్ కాలేజీ ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వం తెలిపింది. డిఎంహెచ్ఒ కార్యాలయ అవరణలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ భవనం ఎప్పటికీ పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల కేంద్రం నుంచి ఇన్‌స్పెక్షన్‌కు వచ్చిన అధికారుల బృందం ఇక్కడ వసతులపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మరోసారి బృందం వచ్చి తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేస్తేనే మెడికల్ కాలేజీ ఈ ఏడాది ప్రారంభమవుతుందని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తే ఈ ఏడాది మెడికల్ కాలేజీ ప్రారంభం అనుమానమే అనే చర్చ నడుస్తోంది.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై

మార్చిలో ప్రచారోద్యమం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు

దేశ సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలపై మార్చిలో సిపిఎం విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం తెలిపారు. స్థానిక పవరుపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ మండల, పట్టణ నాయకుల సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు పిల్లి రామకృష్ణ అధ్యక్షత వహించారు. సమావేశానికి విచ్చేసిన సీతారాం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందని, ప్రజల భవిష్యత్తును విచ్ఛిన్నం చేస్తోందని, కుంభకోణాలతో దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తోందని విమర్శించారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ది పొందుతుందని ఆరోపించారు. అందుకే బిజెపిని చిత్తుగా ఓడించి దేశాన్ని, దేశ సంపదను, ప్రజల భవిష్యత్తును కాపాడాలని పిలుపునిచ్చారు. దీనికోసం మార్చి నెలలో ప్రచార క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి భారీ కోతలు విధించిందని, ఎరువులపై సబ్సిడీలు తగ్గించి ధరలు పెంచిందని, పెరిగిన ధరలు, ఎరువులు అందక రైతులు సంక్షోభానికి గురై అప్పులు రెట్టింపు కావడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులను కనీసం గుర్తించడానికి కూడా కేంద్ర ప్రభుత్వం నిరాకరించిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీకి ఈ బడ్జెట్లో భారీ కోతలు విధించిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను ఎత్తివేశారని, బడ్జెట్లో సంక్షేమ నిధులు తగ్గిపోయాయని, ధరల పెరుగుదలతో సతమతమవుతున్న జనానికి మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా ఈ బడ్జెట్ భారాలు కోలుకోలేని దెబ్బతీస్తాయని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరించడమే కాకుండా విభజన హామీలు ఏఒక్కటీ అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వకుండా, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ ఆపకుండా, కడప ఉక్కు, రాజధాని నిర్మాణం, పోలవరానికి నిధులు ఇవ్వకుండా ఈ బడ్జెట్లో రాష్ట్రం పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శించిందని విమర్శించారు. అదానీ కుంభకోణం అంతర్జాతీయంగా భారతదేశానికి తలవంపులు తెచ్చిందని, చిన్న మదుపుదార్లు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసిని ముంచేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తుల్ని, ప్రకృతి వనరుల్ని అదానీపరం చేస్తుండడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అదానీ అవినీతికి వ్యతిరేకంగా ముందుకు రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా పార్లమెంటులో మన రాష్ట్రానికి చెందిన ఎంపీలు నోరెత్తకపోవడం శోచనీయమన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) తన ఎల్‌పిజి గ్యాస్ దిగుమతుల కోసం అదానీ నిర్వహణలో ఉన్న గంగవరం పోర్టుతో చేసుకున్న ఒప్పందంలో ఆర్థిక నష్టం, అక్రమాలు చోటు చేసుకున్నందున కేంద్ర ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ టిడ్కో గృహాలను వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగనన్న ఇళ్ల కాలనీల్లో నిర్మాణానికి తగిన నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి అర్హులైన పేదలకు ఇవ్వాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని, జిల్లాలో అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలని, పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. పేదలు చేస్తున్న భూపోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉపాధి వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్, తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.శ్యామలారాణి, ఎస్.నర్సింహ, బి.సోమయ్య, నాయకులు కె.విజయలక్ష్మి, సుభాషిణి, రాంబాబు, సాయిబాబు పాల్గొన్నారు.

అందాల నగరం.. అందరి బాధ్యత

ప్లాస్టిక్ నిషేధంపై పటిష్ట చర్యలు - పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి - నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్రంలో పురాతన నగరం ఏలూరు.. అభివృద్ధిలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉంది. పాలకవర్గాలు, అధికారులు.. ప్రజాప్రతినిధులు మారుతున్నారుగాని.. నగర స్వరూపం మాత్రం మారడం లేదు. నిధుల లేమి, నిబంధనలే దీనికి కారణాలుగా పాలకవర్గాలు చెబుతూ వస్తున్నాయి. ఈ దశలో అన్ని విభాగాలను, వివిధ శాఖలను సమన్వయం చేసుకుని.. నగరాన్ని సుందరంగా తీర్చుదిద్దుతానని నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ చెబుతున్నారు. ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే

ప్రశ్న: జనన, మరణాల నమోదులో లోపాలు సరిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించిన వారి వివరాలను వైద్యశాఖ నమోదు చేస్తుంది. ప్రయివేట్ ఆసుపత్రుల్లో జన్మించిన వారి వివరాలను ఇక నుంచి సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. ఇళ్ల వద్ద జన్మించే వారి వివరాలను శానిటరీ, పర్యావరణ కార్యదర్శి ద్వారా నమోదు చేయాలని ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశాం. జననం జరిగిన 21 రోజుల్లోపు నగరంలోని 79 సచివాలయాల ద్వారా నమోదు చేసుకోవాలి.

ప్రశ్న: ఏలూరులో ప్లాస్టిక్ నిషేధంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

కేంద్ర ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్లను, సింగిల్ యూజ్డ్ బ్యాగులు కూడా వాడకూడదని, బయోడిగ్రేడబుల్ బ్యాగులు వాడకూడదని ప్రకటించాం. వీటిపై నగరంలో 15 రోజులుగా దాడులు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు రూ.లక్ష వరకు జరిమానా విధించం కూడా. దీనిపై ఇప్పటికే ప్రతి కార్యదర్శికీ అధికారం ఇచ్చాం. చెత్త పరిమాణాన్ని తగ్గించడం, ఆరోగ్యకర సమాజం నిర్మించడమే లక్ష్యం. ఏలూరులో నెల రోజుల వ్యవధిలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిబంధనలను పక్కాగా అమలు చేస్తాం. ప్లాస్టిక్ అమ్మకాలతోపాటు, తయారీపైనా నిషేధాజ్ఞలు ఉన్నాయి.

ప్రశ్న: ఫ్లెక్సీలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిందిగా, నియంత్రణ ఎంత వరకు వచ్చింది?


ఫ్లెక్సీలపై నిషేధం అంశం కోర్టులో ఉంది. ఇక నగరంలో ఎక్కడా కూడా వాల్‌పోస్టర్లను గోడలకు అంటించకూడదు. ఫ్లెక్స్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్ణయించాం. అందాల నగరం.. అందరి బాధ్యత నినాదంతో ప్రతి పౌరుడూ సహకరించాలి. అర్ధరాత్రి వేళల్లో వాల్ పోస్టర్లను అంటిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.


ప్రశ్న: ప్లాస్టిక్ నియంత్రణపై పర్యవేక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్లాస్టిక్ రహిత సమాజానికి విద్యార్థులను భాగస్వాములను చేస్తాం. ప్లాస్టిక్ కవర్స్‌ను, 75 మైక్రాన్లకన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వస్తువులను ప్రభుత్వం నిషేధించింది. కరపత్రాలు, మాధ్యమాల ద్వారా చైతన్యపరుస్తాం. జ్యూట్‌బ్యాగులు, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పిస్తాం. ఏలూరులోని 50 డివిజన్లలో నోడల్ అధికారులను నియమించాం. వీరు అన్ని డివిజన్లలో తిరుగుతూ ప్రజలకు చేరువలో ఉంటారు.

ప్రశ్న:ఏలూరు సుందరీకరణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏలూరును పరిశుభ్రమైన సుందర నగరంగా తీర్చిదిద్దదానికి కృషి చేస్తాను. ఎంఎల్‌ఎ ఆళ్ల నాని, మేయర్ నూర్జహాన్ పెదబాబు, పాలకవర్గం సహకారంతో ప్రత్యేక చర్యలు చేపడతాం. అయితే ప్రజలు, మీడియా సహకరించాలి.





ప్రశ్న: నగర ప్రజలకు ప్రభుత్వ పథకాలను ఎలా అందించాలని భావిస్తున్నారు?

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నవరత్నాల పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందించేలా చర్యలు చేపడతాం. అందుకు సచివాలయ సిబ్బంది, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటాం. ఇళ్ల లబ్ధిదారులను ప్రోత్సహించి గృహ నిర్మాణాలకు లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశిస్తాం.

ప్రశ్న: కుక్కలు, పశువుల నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కుక్కలకు టీకాలు వేసి, స్టెరిలైజేషన్ చేస్తాం. ఇక రోడ్లపై పశువులను వదలకుండా యజమానులతో మాట్లాడతాం.

ప్రశ్న: ప్రకటన ఛార్జీలు వసూళ్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో ప్రకటన ఛార్జీల వసూళ్లకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టేలా చర్యలు తీసుకుంటాం. సచివాలయంలోని ప్లానింగ్ సెక్రటరీలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్ ప్రతిరోజూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని అనధికార నిర్మాణాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు ఇస్తాం. నగరపాలక సంస్థ పరిధిలోని విలీన పంచాయతీల్లో ప్రభుత్వ చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించాం.

కైకలూరు నుంచి పోటీ చేస్తా

మాజీ మంత్రి పిన్నమనేని

ప్రజాశక్తి - కైకలూరు

టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశిస్తే కైకలూరు నుంచి పోటీ చేస్తానని మాజీమంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక సీతారామ కళ్యాణ మండపంలో పిన్నమనేని కోటేశ్వరరావు మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను కైకలూరు టిడిపి టికెట్ ఆశిస్తున్నానని, దీనిపై చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. నియోజకవర్గంతో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. పిన్నమనేని బాబ్జి మాట్లాడుతూ సీటు తనకు కేటాయించినా, తన బాబాయ్ వెంకటేశ్వరరావుకి కేటాయించినా కలిసి పని చేస్తామని ప్రకటించారు. మా కుటుంబంలో కాకుండా వేరే వారికి సీటు కేటాయించినా గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌కె.అలుముద్దిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఒఎస్‌ఎస్ సూచనల మేరకు ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి ఈ నెల 21 నుండి 27వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

150 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - ఉంగుటూరు



లయన్స్ క్లబ్ ఆఫ్ దూబచర్ల, గొల్లగూడెం సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్రవైద్యశాల వైద్యుల సౌజన్యంతో మండలంలోని గొల్లగూడెంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. పాటిబండ్ల సాయిదీప్ జ్ఞాపకార్థం ఆయన తల్లిదండ్రులు సహకారంతో వైద్యులు పాటిబండ్ల నిహిత, నూనె హేమంత్‌కుమార్ సేవలందించారు. పరిసర గ్రామాల నుంచి 150 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా వారిలో 70 మందికి కళ్ల జోళ్లు ఉచితంగా అందించామని నిర్వాహక కమిటీ, లయన్స్ సభ్యుడు కాళ్ల రాజు వెల్లడించారు. మరో 50 మందికి కంటి ఆపరేషన్లకు వైద్యులు సిఫార్సు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు ఆచంట సత్యసత్తిబాబు, గ్రామ సర్పంచి కరపా వెంకట శ్రీనివాసరావు, సాయిబాబా కమిటీ నిర్వాహకులు పిచ్చుకల రత్నాజీ, అడపా మోహనరావు, గుత్తికొండ హరిబాబు, కటారి నరశింహమూర్తి పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు

ప్రజాశక్తి - ఉంగుటూరు




మందులందిస్తున్న వైద్యులు

షుగర్ వ్యాధి ఉన్న పిల్లలు, పెద్దలకు ఆదివారం స్థానిక పాతూరి కల్యాణ మండపంలో ఉచితంగా ఇన్సులిన్, మందులు, బలవర్ధక ఆహారం, టెస్ట్ కిట్లు పంపిణీ చేశారు. ప్రముఖ చక్కెర వ్యాధి వైద్యులు, డయాబెటిక్ రీసెర్చ్ సెంటర్ డాక్టర్ పాతూరి విష్ణుప్రియరావు ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకోసారి రాష్ట్రవ్యాప్తంగా నమోదు చేసుకున్న చక్కెర వ్యాధిగ్రస్తులకు ఒక్కొక్కరికి రూ.మూడు వేలు విలువైన ఔషధాలు, బలవర్ధక ఆహారం అందించడం అభినందనీయమని లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నపిల్లల్లో చక్కెర వ్యాధి ఎక్కువగా కన్పిస్తోందని, ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు, పద్ధతులతో వ్యాధిని నియంత్రణలో పెట్టొచ్చని వైద్యులు విష్ణుప్రియరావు అన్నారు.

పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్టు

ప్రజాశక్తి - ఏలూరు



ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి షాబ్జీ, నేతలు

పదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం మోడల్ టెస్టు నిర్వహించారు. ఎస్‌పిడిబిటి కళా శాల, కెపిడిటి స్కూల్, గాంధీనగర్ హైస్కూళ్లలో నిర్వహించిన ఈ టెస్టులో 720 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత పరీక్షా ప్రశ్నా పత్రాన్ని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ విడు దల చేశారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలు ఇంకెన్నో రాయాలని, విద్యార్థులు ఉన్నత స్థానాన్ని అధిరోహిం చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, పట్టణ కార్యదర్శి రాజేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవి, నగర అధ్యక్ష కార్యదర్శులు జక్రియా, శంకర్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డి.ప్రసాద్, ప్రవీణ్, రిషి రాకేష్, రాజేశ్వరి, రెహనా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి కళ్యాణానికి తలంబ్రాల బియ్యం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

భద్రాద్రి రాముని కళ్యాణానికి 80 క్వింటాళ్ల తలంబ్రాల బియ్యం స్థానికంగా సిద్ధం చేస్తున్నారు. ఆదివారం స్థానిక శ్రీరామ ఆధ్యాత్మిక సేవాసమితి ఆధ్వర్యంలో భద్రాచలంలో శ్రీరామనవమికి జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణంలో యాత్రికులకు ప్రసాదంగా అందించే తలంబ్రాల బియ్యం కోసం 80 క్వింటాళ్ల బియ్యం పంపుతున్నట్లు సమితి అధ్యక్షులు ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. ఈ క్రమంలో రామాలయం వద్ద భద్రాద్రి కళ్యాణానికి తలంబ్రాల బియ్యం తరలించే వాహనానికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ 80 క్వింటాళ్ల బియ్యం రైతులు, భక్తుల నుండి సేకరించి శ్రీరామ ఆధ్యాత్మిక సేవాసమితి ద్వారా పంపుతున్నామని తెలిపారు. శ్రీరామనవమికి గోటితో ఒలిచిన తలంబ్రాలతో 21వ భద్రాచల పాదయాత్ర మార్చి 26వ తేదీ ఆదివారం ఉదయం ఆరు గంటలకు జంగారెడ్డిగూడెం రామాలయం నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో దాకారపు గోపాలకృష్ణ, ఆళ్ల రమేష్, మద్దిపాటి రాంపండు, తెల్లమేకల రామకృష్ణ, పొదిలి సూర్య చిరంజీవి, జెట్టి భీమశేఖర్, ధనకుమార్, బి.రాజ్ కుమార్, బిక్కిన శ్రీనివాస్, గౌర్ని ప్రసాద్, కొల్లూరి శ్రీనివాస్, పాతూరి పాపారావు, కానూరు సత్తిబాబు, మానుకొండ వెంకటరెడ్డి, వల్లూరి విష్ణుమూర్తి, శ్రీనివాస్, వెదుళ్ల రామకృష్ణ, తన్నీరు రామకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.



నినదిస్తున్న ఆరు గ్రామాల జనం

ప్రత్యేక పంచాయతీ కోరుతూ వంటావార్పు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రం టి.నరసాపురం పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం, రుద్రకోటరాజుగూడెం, పుట్రేపు, ప్రకాశనగర్, కాపుగూడెం, రాజులగూడెం గ్రామాలను కలిపి ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రత్యేక పంచాయతీ పోరాట కమిటీ ఆధ్వర్యాన ఆదివారం ఆయా గ్రామాలకు చెందిన యువకులు అల్లూరి సీతారామరాజు నగర్ వద్ద మూడురోడ్ల రోడ్ల కూడలిలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు మానవహారం నిర్వహించి ధర్నా చేపట్టారు. ఆరు గ్రామాలు టి.నరసాపురం పంచాయతీలో కలిసి ఉండటం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదని, కనీస మౌలిక వసతులైన రోడ్లు, విద్యుత్, విద్య, వైద్యం, సదుపాయాలు లేక ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గర్భిణులు ప్రసవ సమయంలో వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ చిన్న అవసరమైనా సుమారు ఏడు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఆరు గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్జా సాగర్, భూక్యా వేణు, కుంజా రవికిరణ్, తాడేపల్లి చందు, గుండె మహారాజు, బాణాల నాగేంద్ర, పండు వీరభద్రుడు, భూక్యా రవి, శ్రీనివాస్, పోతునూరి వినోద్ పాల్గొన్నారు


నేడు వెంకటకృష్ణాపురంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం పంచాయతీ పరిధి వెంకట కృష్ణాపురంలో మానవత సంస్థ ఉంగుటూరు మండల శాఖ ఆధ్వర్యంలో ఆశ్రం ఆసుపత్రి వైద్య బృందంతో ఈనెల 27న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం నారాయణపురంలో సమాయత్త ఏర్పాట్ల కోసం సమావేశం అయ్యారు. మానవత రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపీ మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు మానవత కృషి చేస్తోందన్నారు. వెంకటకృష్ణాపురంలో జనరల్ మెడిసిన్‌తో పాటు ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, చర్మం, ఊపిరితిత్తులు, స్త్రీవైద్య నిపుణులు దాదాపు 20 మంది వైద్య బృందం సేవలు అందిచనున్నారని తెలిపారు.

28న భీమడోలు మండలం పూళ్లలో...

భీమడోలు : మండలంలోని పూళ్ల గ్రామంలోని కల్లి కొండమ్మ, నాగరత్నమ్మ మెమోరియల్ వైద్యశాల వేదికగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఈ నెల 28వ తేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో రాజమండ్రికి చెందిన వేద స్పైన్ సెంటర్ వైద్యులు పి.తేజో ఫణీంద్ర వైద్య సేవలు అందిస్తారన్నారు. శిబిరంలో స్పైన్ సమస్యలతో పాటు ఎముకల పటిష్టత శాతాన్ని గుర్తించే ప్రత్యేక యంత్రం ద్వారా సదరు ఫలితాలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందులు పంపిణీ ఉచితంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.


పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

ఆర్యవైశ్య కళ్యాణ మండప ట్రస్ట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపం ట్రస్ట్ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ఉదయం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించారు. ట్రస్ట్ ఛైర్మన్‌గా బొండాడ రామ్మోహనరావు (రాంపండు) ప్రమాణ స్వీకారం చేశారు. ఇతర కార్యవర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.

నేడు సీజ్డ్ వాహనాల వేలం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మోటార్ వాహనాలకు చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 27వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9440796675లో సంప్రదించాలని తెలిపారు.

ప్రజాశక్తి - కైకలూరు

జాతర ఉత్సవాల సందర్భంగా కొల్లేటికోటలో ఉన్న పెద్దింటి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి, కానుకలు సమర్పించారు. శ్రీ జలదుర్గ సమేత శ్రీ పెద్దింటి అమ్మవారికి పంచమావరణ కలశార్చన, పుష్పాలంకరణ, త్రిసది నామార్చన, కుంకుమ పూజ, ధూపదీపసేవ, హారతులు బాల భోగము, ప్రసాదం వితరణ చేశారు. అమ్మవార్లకు వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదాన్ని విజయవాడకు చెందిన కోయి వెంకటేశ్వరరావు, శివ పార్వతి అందించారు. ఆలయ అర్చకులు విశేష పూజలు జరిపించి శేష వస్త్రములతో వారిని సత్కరించారు. సాయంత్రం పంచహారతులు, గుడివాడ వాస్తవ్యులు నరహరిశెట్టి ప్రసాద్ అధ్వర్యంలో చార్లీ చాప్లిన్ కామెడీ క్లబ్ వారిచే హాస్య కబందం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కెవి.గోపాలరావు భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

జీలుగుమిలిల్లో జగదాంబ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి జగదాంబ అమ్మవారి 66వ వార్షికోత్సవ ఉత్సవాలను ఆలయ కమిటీ అధ్వర్యంలో ఘనంగా ప్రారంభించినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ చత్రాతి భవానీశేఖర్ తెలిపారు. ఈ ఉత్సవాలను 26వ తేదీ ఆదివారం నుంచి మార్చి మూడో తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం మొదటి రోజు అమ్మవారికి ఎంపిపి కొర్స పోసమ్మ, వైసిపి నాయకులు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలను ప్రతి ఏడాది ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చీర్రి జగదాంబ, బొడిక భోగేశ్వరరావు, వైసిపి నాయకులు సందా ప్రసాద్, ఉప్పల రాంపండు, కాక్కిరాల రాము, చక్రి, శ్రీను, సతీష్, సత్యనారాయణ, రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

1 నుంచి దండు మారెమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి - గణపవరం

వచ్చే నెల మార్చి ఒకటో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు గణపవరం గ్రామదేవత దండు మారెమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు మారమ్మ దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. మొదటి రోజు అమ్మవారికి గవళ్ల గుడుపు సేవతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎనిమిది రోజుల పాటు అమ్మవారి ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు, కూచిపూడి, జానపదాలు, మ్యూజికల్ నైట్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎనిమిదో తేదీ చివరి రోజు అఖండ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాకారులందరికీ స్థానిక కన్యకా పరమేశ్వరి వర్తక సంఘ భవనంలో విడిదిని ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.


బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న గారపాటి తపన చౌదరి

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గుడిపాడు గ్రామంలో గతంలో పిల్లి నాగేశ్వరరావు, పిల్లి వెంకటేశ్వరరావచు చెందిన ఇళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో వారి తండ్రి పిల్లి అప్పారావు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తపన ఫౌండేషన్ గారపాటి తపన చౌదరి ఆదివారం ఒక్కో కుటుంబానికి రూ.పదివేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మందలపు రాధాకృష్ణ, మందలపు ధర్మరాజు, మందలపు శేషగిరి, కొల్లి మారుతిబాబు, మధు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని వట్టిగుడిపాడు గ్రామంలోని పేకాట శిబిరంపై ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,500 నగదును స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

లక్షలు వెచ్చించి.. లక్ష్యం మరిచి..!

నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు

చెత్తను కాల్చడంతో వాయు కాలుష్యమై ప్రజల ఇబ్బందులు


అధికారులు స్పందించాలని వేడుకోలు



నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్రానికి గ్రామ పంచాయతీలే పట్టు కొమ్మలని, గ్రామ పంచాయతీలు గ్రామ స్వరాజ్యం వలే వెలుగొందాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరుగా ఉండాల్సిన కేంద్రాలు అలంకారప్రాయంగా దర్శన మిస్తున్నాయి.


చెత్తను కాల్చడంతో వాయు కాలుష్యానికి కారణమవుతున్న పొగ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రుపాయిలు వెచ్చించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించాయి. సంపద ఎలా సృష్టించాలో జిల్లా స్థాయి అధికారుల నుంచి సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఎన్నోసార్లు శిక్షణ ఇచ్చింది. ప్రభుత్వ ఆదాయం వెచ్చించి మండల, గ్రామ స్థాయిలో శిక్షణ ఇచ్చినా ఈరోజు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ని రుపయోగంగా ఉం టున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీ వారు ప్రత్యేక వాహనంతో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, ఘన, ద్రవ పదార్థాలుగా తయారు చేసి అమ్మితే పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందనే ఉద్దేశంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించి, దానిపై శిక్షణ ఇచ్చారు. కాని అవి నిరుపయోగంగా, అలంకారప్రాయంగా ఉండడంతో సేకరించిన చెత్తను కాల్చుతున్నారు. దీంతో పంచాయతీలకు ఆదాయం సమకూరకపోగా చెత్తను కాల్చడంతో వాయు కాల్యుష్యమై ఆ గాలిని పీలుస్తున్న తాము అనారోగ్యానికి గురవుతామని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఆ గ్రామం దగ్గరలో ఉన్న చెరువులో చెత్తను పడేయడంతో పాడి పశువులు ఆ చెరువులో నీరు తాగి అనారోగ్యానికి గురై చనిపోయే ప్రమాదం ఉందని రైతులు, పశువుల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తే గ్రామ పంచాయతీలు ఆర్థికంగా పుంజుకోవడంతో పాటు కొందరికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుభవాలు పంచుకుంటూ.. సత్కారాలు పొందుతూ

ఘనంగా సుబ్బమ్మదేవి హైస్కూల్ వజ్రోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్ 75 సంవత్సరాల వజ్రోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం చదువుతున్న విద్యా ర్థిలతో పాటు, పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో, ఆనం దోత్సాహాలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ సిఎం, ఏలూరు శాసనసభ్యులు ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని), ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, స్కూల్ పూర్వ విద్యార్థులు, రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, ఆయన సతీమణి ఊర్మిళ సుబ్బారావు, ఐపిఎస్ అధికారి రెడ్డిగం గాధరరావు, ఉన్నత స్థానంలో ఉన్న పూర్వ విద్యార్థులు పలువురు పాల్గొని పాఠశాలలో తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రముఖులను సత్కరించి అభినందనలు తెలిపారు.


సుబ్బమ్మదేవి హైస్కూల్ వజ్రోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆళ్ల నాని



మేయర్‌ను సత్కరిస్తున్న వక్తలు

రామ్మోహన్‌రావు మృతి తీరని లోటు

సంతాప సభలో వక్తలు

ప్రజాశక్తి - భీమడోలు

విశ్రాంత ఉద్యోగుల సంఘం భీమడోలు శాఖ అధ్యక్షులు అల్వా వెంకట రామ్మోహన్‌రావు మృతి తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు సమితి ఆవిర్భావం సందర్భంగా ఉద్యోగిగా చేరి మండల పరిషత్ వ్యవస్థలో కొనసాగుతూ ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయ సీనియర్ సహాయకులుగా పనిచేసి ద్వారకాతిరుమల ఎంపిడిఒగా రామ్మోహన్‌రావు ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం పూర్వపు భీమడోలు సమితి స్థాయిలో గల భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి ఆయన కృషి చేశారు. ఈ నేపథ్యంలో విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం పేర భీమడోలు కేంద్రంగా కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని బహుకరించారు. ఇదే క్రమంలో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన సంఘ భవన నిర్మాణానికి తన వంతు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యాలయం ద్వారా విశ్రాంత ఉద్యోగుల ఇబ్బందులను లేఖల పూర్వకంగా, వ్యక్తిగతంగా తెలుసుకొని వాటిని భీమడోలు ఖజానా శాఖ పరిధిలో పరిష్కరించేందుకు తన వంతు సహకారాన్ని అందించేవారని వక్తలు తెలిపారు. ఆయన ఆదివారం భీమడోలు జంక్షన్‌లోని తన స్వగృహంలో మృతి చెందారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు, ఆయన సహచరుడు ఏలూరు డిఎల్‌పిఒగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పంచకర్ల సత్యనారాయణ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రముఖులు గంధం వెంకట్రావు, సామాజిక కార్యకర్త ఎం.సుధాకర్ పాల్గొన్నారు.


రామ్మోహన్‌రావు (ఫైల్‌ఫొటో)

డిసిసిబి బ్యాంకులో రూ.150 కోట్లు పక్కదారి?

రైస్‌మిల్లర్ సత్యనారాయణ బహిరంగ ఆరోపణలు

ఖాతాదారుల్లో ఆందోళన

ప్రజాశక్తి - కామవరపుకోట

మండల కేంద్రమైన కామవరపుకోట డిసిసిబి బ్యాంకులో సుమారు రూ.150 కోట్ల ఖాతాదారుల సొమ్ము పక్కదారి పట్టడంపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు. డిసిసిబి బ్యాంకులో రూ.150 కోట్ల వరకు కుంభకోణం జరిగిందని స్థానిక రైస్ మిల్లర్ ఎ.సత్యనారయణ బహిరంగ ఆరోపణలు చేస్తున్న వీడియో ప్రచార మాధ్యమల్లో హల్‌చల్ చేయడంతో డిసిసిబి ఖాతాదారుల్లో ఆందోళన మొదలైంది. అక్టోబర్ 2022లో ఒక నెలలోనే రూ.1.50 కోట్లు పక్కదారి పట్టినప్పటికీ ప్రస్తుత డిసిసిబి సిఇఒ రికవరీ చర్యలు ఎందుకు చేపట్టలేదని సత్యనారాయణ బహిరంగ ప్రశ్నలు వేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భారీగా బ్యాంకులో సొమ్ము పక్కదారి పట్టాయని ఆరోపించారు. డిసిసిబి బ్యాంకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో పని చేసిన ఓ నోడల్ ఆఫీసర్ ఇప్పుడు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సిఇఒ రూ.30 కోట్ల చేతివాటం చూపారని బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు. నకిలీ బంగారం కుదవ పెట్టి సొమ్ము ఇచ్చారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

గతంలో చాగల్లు బ్రాంచ్‌లో నకిలీ బంగారం అప్పుల కుంభకోణంలో ఆనాటి నోడల్ ఆఫీసర్ జనరల్ మేనేజర్ పాత్ర ఉందని ఆరోపించారు. ఓ షుగర్ ఫ్యాక్టరీకి ఇచ్చిన అప్పు పదేళ్ల క్రితం రూ.పది కోట్లు నేడు వడ్డీతో కలిపి ప్రస్తుతం రూ.30 కోట్లు ఎవరు వసూలు చేస్తారని ప్రశ్నించారు. బ్యాంకు గ్యారంటీల పేరుతో ఎటువంటి హామీలు లేకుండా రూ.30 కోట్లు స్వాహా చేసిన బ్యాంకు ఉన్నతాధికారులు ఇప్పటికీ ఒక రూపాయి కూడా తిరిగి చెల్లించకపోయినా ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అవినీతి కుంభకోణంపై ప్రస్తుత డిసిఒ, జిల్లా కలెక్టర్ దర్యాప్తు వేగవంతం చేసి ఖాతాదారుల సొమ్ములు తిరిగి రికవరీ చేయాలని కోరారు. అలాగే ఉన్నతాధికారులు స్పందించి అవినీతి కుంభకోణంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను తొలగించి డిసిసిబి బ్యాంకుపై ఖాతాదారులకు నమ్మకం నిలబెట్టాలని రైస్ మిల్లర్ ఎ.సత్యనారయణ కోరారు. వివరణ కోసం బ్యాంక్ మేనేజర్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గోల్డ్ స్కాం..?

నకిలీ బంగారంతో రుణాలు

జంగారెడ్డిగూడెం బ్రాంచ్‌లో తనిఖీలు


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో గోల్డ్ స్కాం వెలుగులోకి వచ్చింది. ఆదివారం బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గోల్డ్ స్కాం వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఇటీవల పట్టణంలో ఐసిఐసిఐ బ్యాంకులో, లక్కవరం ఆంధ్రా బ్యాంకులో ఖాతాదరుల సొమ్ము పక్కదారి పట్టిన సంఘటనలు మరువక ముందే బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నకిలీ బంగారంతో రుణాల స్కాం వెల్లడి కావడం పలువురి ఖాతాదారుల్లో అలజడి సృష్టించింది. ఇటీవల సాధారణ తనిఖీల్లో భాగంగా బంగారంపై రుణం తీసుకున్న 21 ప్యాకెట్లను అధికారులు తనిఖీ చేయగా, తనిఖీ చేసిన 21 ప్యాకెట్లలో కొన్ని బంగారం బదులు రోల్డ్ గోల్డ్ ఉన్నట్లు గుర్తించారని తెలిసింది. జంగారెడ్డిగూడెం బ్రాంచ్‌లో రెండు మూడు రోజులుగా ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు రూ.1.90 కోట్ల స్కాంను అధికారులు గుర్తించినట్లు ప్రచారం జరుగుతుంది. ముంబై నుంచి వచ్చిన 21 పేర్లలో ఉన్న బంగారం తాకట్టు సంచులు తనిఖీల్లో తిరగేస్తే నూరుశాతం ఈ సంచుల్లో రోల్ గోల్డ్ ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇలా ఈ బ్రాంచ్‌లో బంగారంపై రుణం తీసుకున్న బ్యాగులన్ని పరిశీలిస్తే మరిన్ని నిజాలు వెలుగు చూసే అవకాశం ఉందని పలు అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి.

దీనిపై బ్యాంక్ మేనేజర్ కరణ్‌కుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా తనిఖీలు జరుతున్న విషయం వాస్తవమేనన్నారు. అయితే బయట వస్తున్న పుకార్లలో వాస్తవం లేదని తెలిపారు. తనిఖీల్లో భాగంగా 20 బ్యాగ్‌లు సవ్యంగా ఉన్నాయని తెలిపారు. ఒకే వ్యక్తికి చెందిన మరో 20 బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న నేపథ్యంలో రెండింటిలో నకిలీ బంగారం గుర్తించామని తెలిపారు. మిగతావి తనిఖీ చేయాల్సి ఉందన్నారు. సోమవారం పత్రికా సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు

పలుచోట్ల రౌడిషీటర్లకు కౌన్సెలింగ్


జంగారెడ్డిగూడెంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సిఐ బాలసురేష్‌బాబు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సమాజంలో వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ బాల సురేష్ బాబు హెచ్చరించారు. స్థానిక సిఐ కార్యలయంలో రౌడీ షీట్, కేడి, సస్పెక్ట్ షీట్ ఉన్న వ్యక్తులకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ బాలసురేష్‌బాబు మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎలక్షన్ నోటిఫికేషన్ సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో మండలంలోని రౌడీ షీట్, కేడి, సస్పెక్ట్ షీట్ ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. వివాదాలకు పాల్ప డకుండా ఉండాలని, మద్యం తాగి గొడవలు చేయవద్దని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాగర్‌బాబు, సర్కిల్ క్రైం పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : రౌడిషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చేయరాదని, చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనరాదని ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు హెచ్చరించారు. ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మండలంలో ఉన్న రౌడీషీటర్, కెడి, సస్పెక్ట్ షీట్ కలిగినవారికి ఆయన ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రౌడిషీటర్లు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఆగిరిపల్లిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ చంటిబాబు

ప్రిలిమ్స్ క్వాలిఫై అయినవారికి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - చింతలపూడి

పివి.సునీల్‌కూమర్‌పై అభిమానంతో ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్ క్వాలిఫై అయిన యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఫైర్‌స్టేషన్ హోంగార్డు సూరిబాబు తెలిపారు. ఇటీవల డిజిపి హోదా పొందిన పివి.సునీల్‌కుమార్ అంటే తనకు అభిమానమని సూరిబాబు తెలిపారు. ఈ క్రమంలో చింతలపూడి మండలంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్ క్వాలిఫై అయినవారికి ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. చింతలపూడి యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

కౌలు రైతు మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మొక్కజొన్న పంటలో కండెలు రాలేదని రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఆ మొక్కజొన పంటను మండల వ్యవసాయాధికారి పరిశీలించారు. నూజివీడు మండలం పొలసానిపల్లి గ్రామానికి చెందిన వేముల వెంకట్రావు ముసునూరు మండలంలోని చింతలవల్లి గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో పంటలో కండెలు రాలేదిన మనస్తాపానికి గురైన వెంకట్రావు ఈ నెల 25వ తేదీన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతను సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ముసునూరు మండల వ్యవసాయాధికారి సిహెచ్.శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి ఆదివారం పరిశీలించారు. పంట దిగుబడి, పంటలో వేసిన ఎరువులు పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంటను పరిశీలించేందుకు సోమవారం ఉన్నతాధికారులు వస్తారని తెలిపారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 367/2021
బిట్వీన్:
పడాల వీర్రెడ్డి ...వాది
మరియు
కుచ్చలపాటి దుర్గారావు వగైరా ...ప్రతివాది
2వ ప్రతివాది: సత్తి సత్యనారాయణ రెడ్డి, తండ్రి: సూర్యనారాయణ రెడ్డి, కాలేజి వద్ద, పెనుమంట్ర-534124, పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు
వాది తరపున దాఖలు చేసిన ప్రకటన
పై నెంబరు దావా, వాది మీ వగైరాల నుంచి రూ.1,51,783/-లు ప్రామిశరీ నోటు బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేయగా మీరు సమన్లు అందుకొననందున, శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీకు దావా సమన్లు జారీ ఆర్డరు వేసినారు. కావున మీరు **ది.17-03-2023 ఉదయం గం॥10:30 గం॥లకు పై కోర్టు ఎదుట హాజరు అవ్వనిఎడల మీ పరోక్షమునందు దావా తీర్మానం జరుగునని ఇందుమూలముగా తమకు తెలియజేయడమైనది.**
శ్రీ గోటేటి భాస్కరమూర్తి,
శ్రీ గోటేటి సత్యవెంకట వరప్రసాద్,
తణుకు, అడ్వకేట్, తణుకు, ప॥గో॥జిల్లా.
26-2-23. సెల్: 93900 18122

In The Court Of The Addl. Senior Civil Judge :: Eluru
I.P.No. 25/2013
Between:
Sri Gunapati Turupal Reddy ***...Petitioner***
AND
Smt. Nandigam Nirmala Devi (Died) and Others ***...Repondent***
పై నెబరు కేసులో R5: Smt. Kondreddy Sudha Rani, W/o. Venkata Rao, R/o. D.No. 204, HIG Colony, Ramachandrapruram, BHEL Town Ship, Hyderabad, R7: Smt. Nandigam Venkata Lakshmi, W/o. Late Dharma rao, R/o. Near Water Tank and Park, Tanuku, R8: Sri Nandigam Ashok, S/o. Late Dharma rao, R/o. Near Water Tank and Park, Tanuku, R9: Sri. Nandigam Hemanth, S/o. Late Dharma rao, R/o. Near Water Tank and Park, Tanuku, అను వార్లకు నోటీసులు అమలు కొరకు **ది. 28-02-2023కి వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజు ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల వారి పరోక్షమందు కేసు సంగతులు తీర్మానించెదరు.
ఇ.శ్రీనివాసబాబు
ఎ.రవికుమార్
ఏలూరు, అడ్వకేట్స్, అమీనాపేట,
25-2-23. ఏలూరు. సెల్: 08812239498

మహారాజశ్రీ IV అడిషనల్ జిల్లా జడ్జి, తణుకు వారి కోర్టులో
G.W.O.P.6/2023
In the matter of Minor:
Master:
అడ్డాడ దిశంత్ వర్మ, D.O.B.10-4-2021
Between:
శ్రీ అడ్డాడ కృష్ణంరాజు ...పిటీషనరు
And
శ్రీమతి ముదునూరు సత్యవతి ...రెస్పాండెంటు
పై నెంబరు పిటీషనులో పిటీషనరు, మాస్టర్ అడ్డాడ దిశంత్ వర్మ మైనరును శ్రీమతి ముదునూరు సత్యవతి W/o.లేటు : కృష్ణంరాజు, ప్రస్తుతం చిరునామా: చిన నింద్రకొలను, నడమర్రు మండలం, ప.గో.జిల్లా వారి వద్ద నుండి పిటీషనరుకు కష్టడికి యిప్పించమని కోరుచూ పై నంబరు పిటీషను దాఖలు చేసినందున ఎవరికైననూ ఆక్షేపణలు ఉన్న యడల ది.10.3.2023వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరు అయి ఆక్షేపణలు తెలుపుకోవలెను.
ఈడ్పుగంటి శ్రీనివాసబాబు
అట్లూరి రవికుమార్
న్యాయవాదులు
ఏలూరు అమీనాపేట, ఏలూరు.
తేది.24-2-2023 సెల్: 94401 88498



ప్రజాశక్తి

పాతపాటి సర్రాజు సంస్మరణ ప్రత్యేక అనుబంధం

పశ్చిమగోదావరి జిల్లా 27 ఫిబ్రవరి 2023 Advt.feature

కష్టేఫలి @ సర్రాజు



వ్యవసాయ కుటుంబం నుంచి ఎంఎల్ఎ వరకూ - నేడు భీమవరంలో సంస్మరణ సభ

ప్రజాశక్తి - కాళ్ల

ఆ కుటుంబంలో తాతల కాలం నాటి నుంచి అంతా వ్యవసాయంపై ఆధారపడిన వారే ఎక్కువ. జక్కరంలోని ఆ కుటుంబంలో 1953లో పాతపాటి సర్రాజు జన్మించారు. ఆయన తల్లిదండ్రులు శ్రీరామరాజు, అచ్చమ్మ. సర్రాజుకు ఒక సోదరుడు, ముగ్గురు సోదరీమణులు. జక్కరం వ్యవసాయ గ్రామం కావడంతో శ్రీరామరాజు వరిసాగు చేసేవారు. సర్రాజు చిన్నతనం నుంచి తండ్రి వెంట పొలాలకు వెళ్తుండేవారు. కోపల్లె హైస్కూల్లో ఏడో తరగతి చదివారు. ఆ తర్వాత వ్యవసాయంపై దృష్టి సారించి వరి సాగు చేస్తూ.. ధాన్యం కొనుగోలు చేసి ఎడ్లబళ్లపై ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలిస్తూ కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్నారు. వ్యవసాయ ..2లో

మంచిమనిషి, అనురాగానికి చిరునామా...

అమృతమూర్తికి
అనురాగ పుష్పాంజలి





అహర్నిశలు మా ఉన్నతికై శ్రమించి,
మాకు తరగని ప్రేమను పంచి,
ఎందరికో సాయం చేసి,
ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని అణువణువునా నింపుకొని,
మంచితనానికి మారుపేరుగా నిలిచి,
అందరి హృదయాలలో
సుస్థిర స్థానాన్ని సంపాదించి,
సుదూర తీరాలకేగిన
మీ పవిత్ర ఆత్మకు శాంతి
చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...
అశ్రునయనాలతో...

కీ॥శే॥ శ్రీ పాతపాటి సర్రాజు
ఉండి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్
జననం: 09-07-1952 మరణం: 17-02-2023

భార్య : **అన్నపూర్ణమ్మ**

కుమారుడు : **పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు) - గీతా భవాని**
పాతపాటి యుగంధర్ నాగవర్మ (వర్మ)
మనుమడు : **పాతపాటి మహిపాల్ నాగ సర్రాజు**
మనవరాలు : **పాతపాటి మన్విత**



"కన్నీటి నివాళులతో"

దశాహం: ది. 27-02-2023 సోమవారం భీమవరం ఆదర్శనగర్‌లోని మా స్వగృహమునందు జరుగును.







కన్నీటి వీడ్కోలు



సర్రాజు మృతి రైతాంగానికి తీరని లోటు



లయన్స్ క్లబ్ ఏలూరుపాడు అధ్యక్షులు మంతెన వెంకట రవివర్మ

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి మాజీ ఎంఎల్‌ఎ పాతపాటి సర్రాజు ఆకస్మిక మృతి రైతాంగానికి తీరని లోటని లయన్స్ క్లబ్ ఏలూరుపాడు అధ్యక్షులు మంతెన వెంకట రవివర్మ అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ సర్రాజుకు వ్యవసాయంపై పూర్తి అవగాహన ఉండడంతో ఎంఎల్‌ఎగా పని చేసినప్పుడు వెంకయ్యవయ్యేరు ఆధునీకరణకు కృషి చేశారన్నారు. కర్రనాచు నివారణకు పంట కాలువకు బెడ్ కాంక్రీట్ పనులు చేయించారన్నారు. రైతుల అభివృద్ధికి నిరంతరం పాటు వడ్డారన్నారు. కొల్లేరు, ఉప్పుటేరు తీర ప్రాంతాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించే పట్టు వదలని విక్రమార్కుడు అని చెప్పవచ్చన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు.

మొదటిపేజీ నుంచి

కష్టేఫలి @ సర్రాజు

సాగులో రాణించడంతో ఆ తర్వాత చేపలు, రొయ్యల సాగు చేపట్టారు. జెసిబి, యంత్ర పరికరాలు వినియోగంలో లేని కాలం కావడంతో కూలీలతో మట్టిని తవ్వించి తట్టలతో గట్టుకు చేర్చి చెరువుగా మలిచేవారు. మొదట్లో ఉప్పుటేరు, కొల్లేరు తీర ప్రాంతాల్లో 1800 ఎకరాల్లో చేపల చెరువు లీజుకు తీసుకుని సాగు చేసేవారు. చేపల సాగులో మంచి దిగుబడి రావడంతో కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. ఆ తర్వాత ఆక్వా డీలర్‌గా వ్యాపారం చేపట్టారు. రొయ్య సీడ్ వ్యాపారంతోపాటు రొయ్యల సాగు చేశారు. రాజకీయాలపై ఆసక్తితో 1972లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వరి, ఆక్వా రైతుగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. 1991-94 మధ్యకాలంలో టెలికాం అడ్వయిజరీ బోర్డు డైరెక్టర్‌గా పని చేశారు. రైతు నాయకుడిగా 1992లో సొసైటీ ఎన్నికల్లో కోపల్లె సొసైటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1994లో ఆకివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, 2000లో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షునిగా, 2001లో ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ సంస్థ డైరెక్టర్‌గా పని చేశారు. ఆ తర్వాత రియల్ ఎస్టేట్, బిల్డర్‌గా అంచెలంచెలుగా ఎదిగారు. పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షునిగా 1999-2004 మధ్యకాలంలో పని చేశారు.

2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉండి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. టిడిపి కంచుకోటను ఆయన బద్దలు కొట్టి ధీరునిగా నిలిచారు. ఎంఎల్‌ఎగా ఉంటూ ఒకపక్క ఆక్వాసాగు.. మరోపక్క రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ముందుకు సాగారు. 2007-08లో వెంకటేశ్వర యూనివర్సిటీ సభ్యునిగా, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకునిగా పని చేశారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా



పోటీ చేసి ఓడిపోయారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. వైసిపి ఉండి నియోజకవర్గ కన్వీనర్‌గా, కేంద్ర మండలి సభ్యులుగా వ్యవహరించారు. 2021లో వైసిపి ప్రభుత్వం రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని సర్రాజుకు అప్పగిచింది. వైసిపి పోలవరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న సర్రాజుకు ఈ నెల 17వ తేదీ రాత్రి గుండెపోటు రావడంతో మృతి చెందారు. తుది శ్వాస విడిచే వరకూ రైతులు, ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడ్డారు.



సర్రాజు హయాంలో నిర్మించిన కోపల్లె సహకార బ్యాంకు

ప్రగతి బాటలో.. ప్రజా సేవలో..

సర్రాజు హయాంలో కోపల్లె సొసైటీ అభివృద్ధి

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె సహకార బ్యాంకు ప్రగతి బాటలో పురోగమిస్తూ ప్రజాసేవలో తరిస్తోంది. 1956లో సొసైటీ ఏర్పడింది. నాటి నుంచి నేటి వరకు అన్ని ఎన్నికలూ ఏకగ్రీవాలే. బ్యాంకు వ్యవస్థాపకుల స్ఫూర్తి అడుగడుగునా మూర్తిభవిస్తూ బాధ్యతాయుతమైన సభ్యులు, అంకితభావం, క్రమశిక్షణ కలిగిన సిబ్బంది, అధ్యక్షుల కృషితో పురోగమిస్తోంది. కోపల్లె సహకార బ్యాంకు పరిధిలో ఉన్న 11 గ్రామాల ప్రజలకు, రైతులకు విస్తృత సేవలు అందిస్తోంది. 1992లో సొసైటీ ఎన్నికల్లో పాతపాటి సర్రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విశిష్ట సేవలు

1993 నుంచి 1995 వరకు మూడేళ్ల పాటు సొసైటీ అధ్యక్షులుగా అభివృద్ధికి కృషి చేశారు. రైతులకు, ప్రజలకు విశిష్ట సేవలందించారు. 1993లో సొసైటీ నూతన భవన నిర్మాణానికి అప్పటి రాష్ట్ర గనులు, చిన్న తరహా గ్రామీణ పరిశ్రమల శాఖ మంత్రి చేగొండి హరిరామజోగయ్య శంకుస్థాపన చేశారు. అప్పటి హైకోర్టు జడ్జి పి.రామకృష్ణంరాజు చేతుల మీదుగా భవన ప్రారంభోత్సవం నిర్వహించారు. క్యాష్ కౌంటర్, స్ట్రాంగ్ రూములను నిర్మించారు. సర్ ఆర్థర్ కాటన్ విగ్రహావిష్కరణ అప్పటి డిసిసిబి అధ్యక్షులు వట్టి వెంకటరంగపార్థసారధి చేతుల మీదుగా చేశారు.

రుణాల పెంపు

వ్యవసాయ పంట రుణాలు, గోల్డ్‌లోన్, లేబర్ రుణాలు పెంచి ప్రతి రైతాంగానికి అండగా నిలిచారు. అప్పటి నుంచి రైతు బాంధవుడై ఉంటూ వరి, ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ప్రజలకు, రైతులకు అన్ని రకాలైన బ్యాంకింగ్ సదుపాయాలను అందిస్తోంది. 11 గ్రామాల పరిధిలో ఉన్న రైతాంగానికి సర్రాజు చేసిన కృషి ఎనలేనిది. అప్పటి నుంచి సొసైటీ అధ్యక్షులు ఎన్నికల్లో పాత్ర ఉన్నవారే అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికవుతూనే ఉన్నారు. జక్కరం గ్రామంలో సొసైటీ బ్రాంచ్ కూడా ఏర్పాటైంది. ఆయన తుది శ్వాస విడిచే వరకూ సొసైటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూనే ఉన్నారు.

అభివృద్ధి ప్రదాత... సేవా పెన్నిధి

రైతు, ప్రజా బాంధవునిగా పేరొందిన పాతపాటి సర్రాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలు, రైతులు బాగుంటేనే గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయని భావించే వారిలో ఒకరు పాతపాటి సర్రాజు. రైతు, ప్రజా సమస్యల పరిష్కారంలో పట్టు వదలని విక్రమార్కుడిలా వ్యవహరించడం ఆయన నైజం. మూడు దశాబ్దాలుగా వివిధ పదవులు చేపట్టి ప్రజా సేవాతత్పరునిగా పేరొందారు. సీనియర్ రాజకీయవేత్త వైఎస్ఆర్ కుటుంబంతో సన్నిహితంగా ఉంటూ నాడు రాజశేఖర్‌రెడ్డికి, నేడు జగన్మోహన్‌రెడ్డికి అత్యంత ఇష్టునిగా గుర్తింపు పొందారు. ఉప్పుటేరు, కొల్లేరు ప్రాంతాల అభివృద్ధి కోసం పాటుపడ్డారు. కొల్లేరు, ఉప్పుటేరు తీర ప్రాంత రైతులు, ప్రజల శ్రేయస్సు కోసం నిర్విరామ కృషి చేశారు. పాతపాటి సర్రాజు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రాజకీయాల్లో గుర్తుండిపోయే పేరు. కాళ్ల మండలం జక్కరం గ్రామంలో జన్మించిన ఆయన సాధారణ స్థాయి నుంచి ఎంఎల్ఎగా జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. టిడిపి కంచుకోటగా పేరొందిన ఉండి నియోజకవర్గంలో సర్రాజు 2004లో కాంగ్రెస్ తరఫున గెలుపొంది కంచుకోటను బద్దలుకొట్టిన ఒకే ఒక్కడుగా నిలిచారు. ఉప్పుటేరు నుంచి ఉప్పు నీరు ఎగదన్నకుండా రెండు చోట్ల రెగ్యులేటర్లు నిర్మించాలని అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనేకసార్లు బృందాలవారీగా ఉప్పుటేరు, కొల్లేరు తీర ప్రాంతాల పరిస్థితులను పరిశీలించారు. ఉండి నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు ఆయన ఎంఎల్ఎగా ఉన్న సమయంలోనే జరిగాయి. వంతెనలు, రోడ్లు, తాగు, సాగునీటి పనులతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

పేదల కష్టం తెలిసిన మహానుభావుడు

ఆపదలో ఉన్నవారికి అపన్న హస్తం అందించిన నాయకుడు. పార్టీ బాగుంటేనే మనం బాగుంటామని కార్యకర్తలకు నిత్యం చెబుతుండేవారు. పార్టీకి అంకితభావంతో పని చేయడం ఆయన నైజం. కాంగ్రెస్, వైసిపిలో సర్రాజు కృషి అజరామరం. సర్రాజు అమూల్యమైన సేవలను గుర్తించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి క్షత్రియ కార్పొరేషన్‌కు ప్రప్రథమ ఛైర్మన్‌గా నియమించారు. ఈ నెల 17వ తేదీ రాత్రి సర్రాజుకు గుండెపోటు రావడంతో మృతి చెందారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 18న భీమవరంలో సర్రాజు స్వగృహానికొచ్చి ఆయన పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అధికారిక లాంఛనాలతో సర్రాజు అంత్యక్రియలు జక్కరం గ్రామంలో నిర్వహించారు.

నేడు భీమవరంలో సర్రాజు సంస్మరణ సభ

ప్రజాశక్తి - కాళ్ల

భీమవరం ఆదర్శనగర్‌లో తమ స్వగృహంలో ఈ నెల 27న సోమవారం పాతపాటి సర్రాజు సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు వారి కుమారులు పాతపాటి వెంకట శ్రీనివాసరాజు, పాతపాటి యుగంధర్ నాగవర్మ తెలిపారు. ఈ సభకు సర్రాజు సోదరులు పాతపాటి సూర్యనారాయణరాజు, శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, ధర్మాన కృష్ణదాస్, సిదిరి అప్పలరాజు, జోగి రమేష్, టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి, ఎంపీలు మిధున్‌రెడ్డి, మార్గాని భరత్, కోటగిరి శ్రీధర్, ఉండి, భీమవరం, కైకలూరు, దెందులూరు, పోలవరం ఉంగుటూరు నియోజకవర్గాల ఎంఎల్ఎలు, మాజీ ఎంఎల్ఎలు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సభకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాతపాటి సర్రాజు అభిమానులంతా తప్పక హాజరు కావాలని వారు కోరారు.

సర్రాజు మాటలు కల్మషం లేనివి

ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల



సర్రాజు కల్మషం లేకుండా మాట్లాడేవరని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజల మేలు కోసం సర్రాజు కృషి అమోఘమన్నారు. నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేసిన అభివృద్ధి ప్రదాత అని కొనియాడారు. సర్రాజు చేసిన సేవలు మరువలేనివన్నారు.







రూ.800 కోట్లతో ఉండి నియోజకవర్గ అభివృద్ధి

సర్రాజు ఘనత

ప్రజాశక్తి - కాళ్ల

పాతపాటి సర్రాజు సేవలను గుర్తించిన అప్పటి కాంగ్రెస్ నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2004లో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇచ్చి ఉండి బరిలో నిలిపారు. సర్రాజు ప్రజాభిమానంతో విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఉండి నియోజకవర్గంలో మూడు దశాబ్దాల కాలంలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలో సర్రాజు చేసి చూపించారనే పేరొందారు. నియోజకవర్గ అభివృద్ధికి రేయింబవళ్లు కృషి చేసి రూ.800 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశారు. మూడు దశాబ్దాల క్రితం వరకూ ఏర్పడని రోడ్లను గుర్తించి అభివృద్ధి చేశారు. గ్రామాలను అనుసంధానం చేస్తూ వంతెనలను నిర్మించారు. ఆర్‌డబ్ల్యుఎస్ నిధుల ద్వారా తాగునీటి సౌకర్యాలు ప్రతి గ్రామంలో కల్పించారు. పంట, మురుగు కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టడంతో వరి, ఆక్వా రైతులు సాగు చేసేందుకు వీలు ఏర్పడింది. కాళ్లలో బిసి ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్ ఏర్పాటుకు ఎంతో కృషి చేశారు.

పంటలకు పుష్కలంగా నీరందేలా కృషి


ఎకరం చేను ఎండకుండా సాగునీరు అందించేలా సర్రాజు నిరంతరం పోరాడుతూనే ఉండేవారు. బీడుగా ఉన్న చేలను వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేశారు. సాగు, మురుగునీటి వ్యవస్థ పటిష్టానికి ఎమ్మెల్యేగా తన పదవీకాలంలో నిరంతరం కృషి చేశారు. ఆనాడు ప్రభుత్వం నుండి జిఒ తీసుకొచ్చి ప్రతి నీటి సంఘానికి రూ.ఐదు లక్షల నిధులు తెచ్చి పంట, మురుగు కాలువల అభివృద్ధికి కృషి చేశారు. ప్రతి రైతూ ఆర్థిక పరిపుష్టి సాధించేలా వరి, చేపలు, రొయ్యలు చెరువులకు పూర్తిస్థాయిలో నీరందించేందుకు నిరంతరం తపించేవారు.

రూ.వెయ్యికే కుళాయి మంజూరు

పేదోడికి వెయ్యి రూపాయలకే కుళాయి కనెక్షన్లు వేలాదిగా ఇప్పించారు. ఆకివీడు తరహాలో మిగిలిన పెద్ద గ్రామాల్లో తక్కువ ధరకే కుళాయి మంజూరు చేయించారు.

ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ

పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణానికి తొలి ప్రాధాన్యతగా పాటుపడ్డారు. ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామ శివారు తాళ్లకోడులో 74 ఎకరాల భూసేకరణ చేశారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో మొత్తం 150 ఎకరాలకుపైగా భూసేకరణ చేసి పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. పంట, మురుగు కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టడంతో వరి, ఆక్వా రైతులు సాగు చేసేందుకు వీలు ఏర్పడింది. కాళ్లలో బిసి ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్ ఏర్పాటుకు ఎంతో కృషి చేశారు.



సర్రాజు ను సత్కరిస్తున్న క్షత్రియ సేవా సమితి నాయకులు

స్వచ్ఛమైన నీరందించేందుకు కృషి

నియోజకవర్గంలోనే ఎక్కువ శాతం మంది ప్రజలు కలుషిత నీరు తాగుతున్నారని అప్పటి సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా రూ.30 కోట్లతో పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ చేయించి నిర్మాణ పనులను సర్రాజు పూర్తి చేయించారు. శివారు ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేశారు.

పేదలకు ఆత్మీయ పలకరింపు

సర్రాజు కనిపిస్తే పేదలు పులకరించి పోతారు. ప్రతి వ్యక్తినీ పేరు పెట్టి పిలిచి పలుకరించే మనస్తత్వం. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలను పలకరించి, ఆర్థిక సాయంతోపాటు భోజన వసతులు, దుస్తులు, వంట సామగ్రి అందజేసేవారు. ఇతరుల చదువులకు, గ్రంధాలయాలు, విగ్రహాల ఏర్పాటుకు ఆయన విరివిగా విరాళాలు అందజేసేవారు.

ఇంటి నిర్మాణానికి సాయం

సర్రాజు ఎంఎల్‌ఎగా పని చేసిన రోజుల్లో పేదవాడు ఇల్లు కట్టుకుంటే రూ.20 వేలు ఆర్థిక సాయం, 20 బస్తాల సిమెంటు, ఇసుక ఉచితంగా అందజేశారు. మండలానికి ఒక లారీ ఏర్పాటు చేసి ఇంటికొక లారీ ఇసుక ఇసుక ఉచితంగా అందించేవారు. విష్ణురాజు ప్రోత్సాహంతో అంజని సిమెంట్ అందించారు. క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పేద క్షత్రియులకు ఆర్థిక సహాయం అందజేశారు. వారి అభివృద్ధికి తనవంతు కృషి చేశారు.

అసెంబ్లీలో నవ్వుల జల్లు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో సర్రాజు ప్రజా సమస్యలపై మాట్లాడుతుంటే అప్పటి సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డితో సహా అందరూ చిరునవ్వులు చిందించేవారు. కల్మషం లేని సర్రాజు మాటలు అసెంబ్లీలో నవ్వులు కురిపించేవి. సర్రాజు అడిగిన అభివద్ధి పనులకు నిధుల మంజూరుకు నాటి సిఎం వైఎస్ ఓ..ఎస్ అనేవారు.

ఆ వెలుగులు సర్రాజు ఘనతే

పాతపాటి సర్రాజు పట్టుబడితే అంతే.. ఆ పని జరిగి తీరాల్సిందే. ఇది నియోజకవర్గ ప్రజల నమ్మకం. టిడిపి ప్రభుత్వ హయాంలో ఉండిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం మొదలుపెట్టారు. అనేక అవాంతరాలతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో విద్యుత్ కోత, లోఓల్టేజీ సమస్యలతో ప్రజల ఇబ్బందులు పడేవారు. 2004లో రాజశేఖర్‌రెడ్డి నేతత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. పాతపాటి సర్రాజు ఎంఎల్‌ఎగా గెలిచారు. అంతే 220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పున:ప్రారంభమయ్యాయి. రాజశేఖర్‌రెడ్డి వద్దకు వెళ్లి నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలను ఏకరవు పెట్టి ఆయనను ఒప్పించి నిధులు తెచ్చారు. 220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పూర్తి చేయించారు. అలాగే 33/11 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణానికి నిధులు కావాలని పట్టుబట్టారు. దీంతో జక్కరం, ఎస్‌సి బోసు కాలనీ, కోలమూరు వంటి ప్రాంతాల్లో 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మించి నియోజకవర్గంలో విద్యుత్ వెలుగులు నింపారు.

మైకాసురుడు

పెద్ద చదువులు చదవని సర్రాజు సభల్లో మాట్లాడేందుకు ఇంట్లోనే స్వయంగా ప్రాక్టీస్ చేసేవారు. ఆయన మాటల్లో యాస అందరినీ ఆకట్టుకునేది. ఉండి నియోజకవర్గంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు విచ్చేసిన సందర్భంలో సభల్లో సర్రాజు మైకు పట్టుకుని గంటలు తరబడి ప్రసంగించేవారు. మైకు పట్టుకుంటే ఓ పట్టాన వదలకపోవడంతో అప్పట్లో కోలనపల్లి గ్రామంలో పేదల ఇళ్ల నిర్మాణ ప్రారంభోత్సవ సభలో సర్రాజును వైఎస్ఆర్ మైకాసురుడు అని సరదాగా సంబోధించారు.

ఉండి ఎంఎల్‌ఎగా ఎన్నో విశిష్ట అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఆయన ప్రస్థానం 'సేవ' అనే పదంతోనే ప్రారంభమైంది. 2003 నుండి ఆయన సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఉప్పుటేరు, కొల్లేరు తీరప్రాంతాలతోపాటు ఎక్కడ చిన్న అగ్ని ప్రమాదం జరిగినా అక్కడ ఆయన వాలిపోయే సేవా కార్యక్రమాలు చేపట్టేవారు.

వైఎస్ కుటుంబంతో అనుబంధం


రాష్ట్ర ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తలపెట్టిన పాదయాత్రలో పాతపాటి సర్రాజు తనదైన ముద్ర వేసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో వైఎస్ఆర్ వెంటే నడిచారు. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 2004లో సర్రాజు విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. వైఎస్ఆర్ మరణంతో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి వైసిపిలో చేరారు. 2014లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఆయన వెంట నడిచారు.

ఒకటి క్వాయిన్ బాక్స్.. రెండోది ఆయన సెల్‌ఫోను

ప్రజలకు నేరుగా సేవలందించే దిశగా ఆయన సేవా ప్రస్థానం ప్రారంభించారు. 2003లో ఆకివీడు పాత బస్టాండ్ సెంటర్ వద్ద పలావ్ బండి వద్ద నుంచి ఆయనకు ఫోన్ వెళ్లేది. అంతే తడవుగా సర్రాజు ప్రమాదం జరిగిన చోటుకు వెళ్లి సహాయం అందించేవారు. అనంతర పరిణామాల మధ్య 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సర్రాజు ఏ కార్యక్రమానికి హాజరైన ప్రజల సమస్యలు వినేందుకు క్వాయిన్ బాక్స్ నుంచి ఒక్క రూపాయితో ఫోన్ చేసినా స్పందించేవారు. చిన్నపాటి కరెంటు సమస్య, మంచినీరు, రోడ్లు ఇతరత్రా సమస్యలు ఏమైనా సరే పేదజలు నేరుగా తనతో మాట్లాడే అవకాశాన్ని సర్రాజు కల్పించారు. తద్వారా ఆ సేవలను ఆయన ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆపన్న హస్తం అందించేవారు.

పెద్ద దిక్కును కోల్పోయాం

కవురు శ్రీనివాస్, జెడ్‌పి ఛైర్మన్



ప్రజాశక్తి - భీమవరం

వేదికపై సర్రాజు మాట్లాడితే నవ్వులు పువ్వుల్లా వికసిస్తాయి. అనుకున్నది ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తిత్వం ఆయన సొంతం. సోదరభావంతో అందర్నీ ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగేవారు. జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న గొప్ప నాయకుడు. ఆయన మృతి వైసిపికే కాదు.. జిల్లా ప్రజలకూ తీరని లోటు. జిల్లాలో ఒక పెద్ద దిక్కును కోల్పోయాం. జిల్లాలో వైసిపి గెలుపులో సర్రాజు ప్రముఖ పాత్ర పోషించారు. అటువంటి మహానేతను కోల్పోవడం బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ.. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. సర్రాజు ఆశయ సాధనకు కృషి చేస్తాం.

మకుటం లేని మహారాజు సర్రాజు

కొయ్యే మోషేన్‌రాజు, శాసనమండలి ఛైర్మన్



ప్రజాశక్తి - భీమవరం

సర్రాజు నాకు అత్యంత సన్నిహితులు. కాంగ్రెస్ పార్టీలో ఇద్దరం కలిసి పని చేశాం. వైసిపి ఆవిర్భవించాక పార్టీలో ఇద్దరం అటు పార్టీకి, ఇటు ప్రజానీకానికి అనేక సేవలందిస్తూ వస్తున్నాం. ముఖ్యమంత్రి జగన్ సారధ్యంలో అత్యున్నత పదవులు చేపట్టి ముందుకు సాగుతున్న సమయంలో సర్రాజు మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. పార్టీలోనే కాకుండా వ్యక్తిగతంగాను సూచనలు, సలహాలు అందించేవారు. రాజకీయాల్లో మకుటంలేని మహారాజుగా గుర్తింపు పొందిన వ్యక్తి సర్రాజు. రాజకీయాల్లో మంచి సోదరుడిని కోల్పోయాను. ఆయన లోటు ఎవరూ తీర్చలేనిది. సర్రాజు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.










ప్రముఖులతో సర్రాజు ప్రస్థానం


కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీతో


వైఎస్ఆర్‌తో సర్రాజు


ప్రధాని మోడీకి సర్రాజు అభివాదం



క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా..




కేంద్ర మంత్రి రాజనాథ్‌సింగ్‌తో


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో..




హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయతో








అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాంతో..








కాంగ్రెస్ ప్రముఖ నేత సత్యనారాయణరావుతో..

మనసున్న నేత సర్రాజు

కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - భీమవరం



రాజకీయ పార్టీలు అనేకం ఉన్నాయి. రాజకీయ నాయకులు కూడా ఎంతోమంది ఉంటారు. అయితే మనసున్న నేత ఎవరైనా ఉన్నారంటే అది పాతపాటి సర్రాజు ఒక్కరే. పార్టీ అధిష్టానం దృష్టిలో మంచి గుర్తింపు, జిల్లాలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించిన గొప్ప వ్యక్తి. ఎవరినైనా సరే ఆప్యాయంగా పలకరించి ఆలింగనం చేసుకునే స్వభావం ఆయన సొంతం. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొనసాగుతూ రాబోయే రోజుల్లో అత్యున్నత పదవుల్లోకి వెళ్లాల్సిన సర్రాజును మృత్యువు కబళించడం బాధాకరం. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

సర్రాజు మహానాయకులు

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు



కాళ్ల: అందరికీ మార్గదర్శకంగా నిలిచిన సర్రాజు వంటి మహానాయకులు అరుదుగా ఉంటారని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉండి నియోజకవర్గంలో రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేసిన ఘనత సర్రాజుకే దక్కిందన్నారు. ఇప్పటివరకు అటువంటి అభివృద్ధి ఏ పార్టీలో ఏ నాయకుడు చేయలేదని గుర్తు చేశారు. రైతులు, ప్రజలు బాగుండాలని నిత్యం తపించేవారన్నారు. చలాకీగా ఉండే సర్రాజు లేరంటే నమ్మలేకున్నామన్నారు.

ఆప్త మిత్రుడిని కోల్పోయాను

గ్రంధి శ్రీనివాస్, భీమవరం ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం




ప్రతిరోజూ ఏదోక సందర్భంలో ఇద్దరం మాట్లాడుకునే వాళ్లం. సర్రాజు అకాల మరణం తీవ్రంగా కలచివేసింది. ఆయన, నేను ఒకేసారి అసెంబ్లీలో అడుగు పెట్టాం. ఉండి నియోజకవర్గానికి అనేక సేవలందించి ప్రజల గుండెల్లో సర్రాజు చిరస్థాయిగా నిలిచారు. ధైర్యానికి, సాహసానికి సర్రాజు పెట్టింది పేరు. నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి సర్రాజు అత్యంత ఆప్తునిగా ఉండేవారు. సర్రాజు మరణం పార్టీకి, ప్రజలకు, నాకు తీరని లోటు. కల్మషం లేని గొప్ప వ్యక్తి సర్రాజు. నాకు అత్యంత ఆప్తమిత్రుడు. అటువంటి గొప్ప వ్యక్తిని కోల్పోవడం చాలా బాధగా ఉంది.

అభివృద్ధికి సర్రాజు కృషి ఎనలేనిది

బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి - పాలకోడేరు



ఉండి ఎంఎల్‌ఎగా పాతపాటి సర్రాజు నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశారు. ఐదేళ్ల ఎంఎల్‌ఎ పదవీకాలంలో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకోవడంతోపాటు నియోజకవర్గ ప్రజానీకానికి ఎనలేని సేవలందించారు. ఇప్పటికీ సర్రాజు చేసిన అభివృద్ధి గురించి చెబుతున్నారంటే అది ఆయన గొప్పతనం. సర్రాజు అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం.

సర్రాజు సేవలు మరువలేనివి

కోపల్లె సహకార సంఘం అధ్యక్షులు వేగేశ్న జయరామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల



కోపల్లె సహకార బ్యాంకు పరిధిలో ఉన్న 11 గ్రామాల ప్రజలు, రైతులకు పాతపాటి సర్రాజు విస్తృత సేవలు అందించారని సహకార సంఘం అధ్యక్షులు వేగేశ్న జయరామకృష్ణంరాజు అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ రైతు బిడ్డ కావడంతో పాతపాటి సర్రాజు 1992-95లో సొసైటీ అధ్యక్షులుగా పని చేసి సొసైటీ అభివృద్ధికి కృషి చేశారు. రైతులకు, ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. సొసైటీ భవన నిర్మాణ పనులు సర్రాజు హయాంలోనే చేపట్టారని చెప్పారు. వైసిపి నాయకుడుగా ఆయనను కలిసినప్పుడు రైతుల అభివృద్ధి కోసం పని చేయాలని చెప్పేవారన్నారు. ఆయన మాటలు ఆదర్శప్రాయంగా ఉండేవని చెప్పారు. తుది శ్వాస విడిచే వరకూ రైతాంగం, ప్రజల కోసం పాటుపడ్డారన్నారు.

సర్రాజు మృతి తీర ప్రాంతాలకు తీరని లోటు

జిల్లా సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు

ప్రజాశక్తి - కాళ్ల



రైతు బంధువుడు, మాజీ ఎంఎల్‌ఎ పాతపాటి సర్రాజును కోల్పోవడం ఉప్పుటేరు, కొల్లేరు తీర ప్రాంతానికి తీరని లోటని జిల్లా సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఉప్పుటేరు, కొల్లేరు ప్రాంత అభివృద్ధి కోసం సర్రాజు ఎనలేని కృషి చేశారన్నారు. రైతు కష్టాలు తెలిసిన వ్యక్తి కావడంతో రైతులకు అవసరమైన గ్రావెల్, మెటల్ రోడ్ల నిర్మాణానికి కృషి చేశారన్నారు. రైతు పండించిన పంటను సరైన సమయానికి చేర్చేందుకు పుంత రహదారుల అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. వరి ఆక్వా రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఇటువంటి వ్యక్తులు సమాజంలో అరుదుగా ఉంటారన్నారు.



నిస్వార్థానికి నిదర్శనం సర్రాజు

భూపతిరాజు సత్యనారాయణరాజు, ఎంపిపి, పాలకోడేరు

ప్రజాశక్తి - పాలకోడేరు



రాజకీయాల్లో నిస్వార్థపరునిగా సర్రాజు గుర్తింపు పొందారు. కల్మషం లేకుండా సాగిన వ్యక్తి సర్రాజు. ఒక మాటలో చెప్పాలంటే నిస్వార్థానికి సర్రాజు నిదర్శనం అని చెప్పొచ్చు. ఆయన ఎంఎల్‌ఎగా పని చేసిన సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారు. ప్రజానీకానికి విశేష సేవలు అందించారు. ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో అత్యున్నత స్థానంలో ముందుకు సాగే సమయంలో ఆయన మృతి బాధాకరం. నియోజకవర్గానికి, వైసిపి కుటుంబ సభ్యులకు సర్రాజు మృతి తీరని లోటు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

మహానేత సర్రాజు

డాక్టర్ డి.స్వర్ణలత, కోఆప్షన్ సభ్యులు, పాలకోడేరు



పాలకోడేరు: కాంగ్రెస్ సీనియర్ నేత, మా మావయ్య జాన్ బెన్నీ 2004లో జరిగిన ఎన్నికల్లో సర్రాజుని పరిచయం చేశారు. అప్పటి నుండి ఇప్పటి వరకు సర్రాజు మా కుటుంబ పెద్దగా, కన్న తండ్రిగా వ్యవహరించారు. మా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అనేక సేవా కార్యక్రమాలకు ప్రతి దానికీ సర్రాజుని నేను పిలవడం, ఆయన తప్పక హాజరు కావడం మాతో ఆయనకున్న బంధానికి నిదర్శనం. ఆయనో గొప్ప స్నేహశీలి, మృదుస్వభావి, నిరాడంబరుడు, మంచి మనిషి. అటువంటి గొప్ప వ్యక్తి అకాల మరణం తీవ్రంగా కలిచివేసింది. కాలం కాసేపు ఆగిపోయిందా అనిపించింది. ఆయన మంచితనాన్ని మేమంతా స్మరించుకుంటూ ఆయన బాటలోనే పార్టీకి సేవలందిస్తాం.



మంచి వ్యక్తిత్వం సర్రాజు సొంతం

కొటికలపూడి గోవిందరావు, జనసేన జిల్లా అధ్యక్షులు

ప్రజాశక్తి - భీమవరం



పార్టీలతో సంబంధం లేకుండా అందర్నీ కలుపుకుని వెళ్లే నాయకుడు సర్రాజు. ప్రస్తుత రాజకీయాల్లో ఇటువంటి మనస్తత్వం కలవారు అతి తక్కువ మంది ఉంటారు. ప్రస్తుత రాజకీయాల్లో మంచి వ్యక్తిత్వం కలిగి అందరితో కల్మషం లేకుండా మసులుకునే వ్యక్తి సర్రాజు. రాజకీయాలో నిస్వార్థంగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతున్న సర్రాజు అకాల మరణం బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

కార్యకర్తలకు అండగా సర్రాజు

పి.రిచి జాన్ కిడ్స్, వైసిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి, పాలకోడేరు మండలం



పాలకోడేరు: రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సర్రాజు నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలకు విశేష సేవలందించారు. రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత వైసిపి స్థాపించక ముందే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క సర్రాజు మాత్రమే. వైసిపి ఆవిర్భవించిన తర్వాత నియోజకవర్గంలో పార్టీకి ఎనలేని సేవలందించారు. 2014లో ఉండి ఎంఎల్‌ఎగా పోటీ చేసి ఓటమి పాలైనప్పటికీ తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశారు. ఆయన అకాల మరణం అత్యంత బాధాకరం.

ప్రజలకు, రైతాంగానికి తీరని లోటు

పాతపాటి మురళీ రామరాజు, ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్, జక్కరం

కాళ్ల : పాతపాటి సర్రాజు ఆకస్మిక మృతి ప్రజలకు, రైతాంగానికి తీరని లోటని ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్ పాతపాటి మురళీరామరాజు అన్నారు. ప్రజలు, రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం సర్రాజు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మృతి సామాన్య ప్రజానీకానికి, రైతులకు, వైసిపి నాయకులకు, కార్యకర్తలకు తీరని లోటన్నారు. ఆకివీడులో రెండు వేల మంది పేదలకు వెయ్యి రూపాయలకే కుళాయి కనెక్షన్లు ఇచ్చిన ఘనత సర్రాజుకే దక్కిందన్నారు. పంట కాలువలో గుర్రపుడెక్క, తూడుతో పూడుకు పోయి ఉండేవని, కాల్వలు అభివృద్ధి చేయడం కష్టతరంగా ఉండేదని చెప్పారు. దీంతో ఈ విషయాన్ని అప్పటి ఉండి ఎంఎల్‌ఎ



పాతపాటి సర్రాజుకు నీటి సంఘాల పరిస్థితిని వివరించామన్నారు. జిల్లాలో ఉన్న 20 వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్లతో కలిసి అప్పటి సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారన్నారు. ఆ తర్వాత సిఎంను డిసీలతో నేరుగా కలిసి సమస్యలను విన్నవించామన్నారు. రూ.ఐదు లక్షల నామినేషన్ పద్ధతిలో నీటి సంఘంలో పని చేసేందుకు ప్రత్యేక జిఒ ఇవ్వాలని పాతపాటి సర్రాజు సిఎం రాజశేఖర్‌రెడ్డిని కోరారని చెప్పారు. పంట కాలువలను అభివృద్ధి చేస్తే రైతులకు ఉపయోగపడతాయని గ్రహించిన రాజశేఖర్‌రెడ్డి వెంటనే ప్రత్యేక జిఒ ఇచ్చారని తెలిపారు.



జక్కరం ముద్దుబిడ్డ సర్రాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఉన్న ఊరు కన్న తల్లి అంటారు. అటువంటి జన్మభూమి రుణం తీర్చుకునేవారు అరుదుగా ఉంటారు. పుట్టిన గడ్డ అభివృద్ధికి అండగా నిలిచే వ్యక్తులే గ్రామ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. జక్కరం మైనర్ గ్రామపంచాయతీ. ఆదాయం అంతంత మాత్రమే. ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు అనేక అవస్థలు పడాల్సి వచ్చేది. గ్రామం ఒకప్పుడు రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, డ్రెయినేజీ వంటి సమస్యలకు నెలవుగా ఉండేది. జక్కరం ముద్దుబిడ్డ సర్రాజు ఈ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే స్ఫూర్తితో గ్రామాభివృద్ధికి బాటలు వేస్తూ పేదలకు బాసటగా నిలిచారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు పాతపాటి సర్రాజు కృషి అమోఘం. 2004-09లో ఎంఎల్ఏగా ఉన్న సర్రాజు రూ.రెండు కోట్ల నిధులు మంజూరు చేయించి గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేశారు.


నిర్మల్ పురస్కార్ అవార్డును అందుకుంటున్న సర్రాజు

తాగునీటి చెరువు ప్రక్షాళన

తాగునీటి చెరువు పూడుకుపోయి తాగునీటి అవసరాలు తీర్చలేని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీ ఉండేది. తాగునీటి చెరువును అభివృద్ధి చేసి 80 ఏళ్లు అవుతుంది. సర్రాజు హయాంలో చెరువు తవ్వకం పనులు చేపట్టి చెరువు చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. రామాలయం పున:నిర్మాణం చేపట్టారు. ఇల్లు లేని 90 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ నిధులు మంజూరు చేయించి దాతలను సమీకరించి తన వంతు సహకారం అందించి గ్రామంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించారు. గ్రావెల్, మెటల్, సిమెంట్ రోడ్లు నిర్మించారు. డ్రెయినేజీ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో ఆలం ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని రెండు పూటలా అందిస్తున్నారు.

సర్రాజు నగర్

ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించారు. ఇల్లు కట్టుకున్న ప్రతి పేదవానికీ ఆర్థిక సహకారం అందించడంతో ఆ ప్రాంత ప్రజలు సర్రాజునగర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ కాలనీకి సర్రాజు నగర్ పేరు పెట్టుకోవడం విశేషం. గ్రామంలో పేదలకు ఏ కష్టం వచ్చినా సర్రాజు ఆపద్బాంధవుడిగా ముందుంటారు.

నిర్మల్ పురస్కార్ అవార్డు

గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించడంలో ముందు వరుసలో ఉండేది జక్కరం గ్రామం. ప్రతి ఇంటికీ కుళాయి, మరుగుదొడ్డి నిర్మించారు. జాతీయ స్థాయిలో 2006లో జక్కరం గ్రామం నిర్మల్ పురస్కార్ అవార్డును, రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ గ్రామ పురస్కారం అందుకోవడం విశేషం.


సర్రాజు హయాంలో అభివృద్ధి చేసిన మంచినీటి చెరువు



సర్రాజు కాలనీ



నా రాజకీయ గురువు సర్రాజు

పివిఎల్.నరసింహారాజు, డిసిసిబి ఛైర్మన్

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉండి మాజీ ఎంఎల్ఎ పాతపాటి సర్రాజు నా రాజకీయ గురువు. 2004లో సర్రాజు ఎంఎల్ఏగా పోటీ చేసిన సమయంలో నేను రాజకీయంగా బయటికి వచ్చాను. అప్పటి నుంచి నేను సర్రాజుని రాజకీయ గురువుగా భావించి ఆయన సూచనలు, సలహాలు పాటిస్తూ ముందుకు సాగుతున్నాను. నేను వైసిపిలో చేరడానికి, 2019లో ఉండి ఎంఎల్ఏగా పోటీ చేయడానికి ముఖ్యకారణం సర్రాజే. ఆయన ప్రోద్బలంతోనే నేను ముందుకు సాగాను. అన్ని విషయాల్లో ఒక పెద్దగా సర్రాజు ఉన్నారు. అటువంటి గొప్ప వ్యక్తి మరణాన్ని నేను జీర్ణించుకోలేకపోతున్నాను. నేను అమెరికాలో ఉండటం వల్ల చివరి చూపునకూ నోచుకోలేకపోయాను. సర్రాజు ఆత్మకు శాంతి చేకూరాలని మనసారా కోరుకుంటున్నాను. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

